క్లుప్తంగా

అమ్మ చల్లని చూపు అందరిపై ఉండాలి

ఎమ్మెల్యే హరీశ్‌రావు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రేణుక ఎల్లమ్మ అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ 48వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు హరీశ్‌రావుకు ఘనంగా స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి పత్రం అందజేత



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శాలువా కప్పుతున్న ఎంపీటీసీ ఇస్లావత్ సముకు

మద్దూరు(హుస్నాబాద్): గ్రామ సమస్యలు పరిష్కరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేసినట్లు కొండాపూర్ ఎంపీటీసీ ఇస్లావత్ సముకు మంగళవారం తెలిపారు. హుస్నాబాద్ నుంచి కొండాపూర్‌కు గతంలో బస్సు సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం లేదన్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. మంత్రి స్పందించి త్వరలో బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

చదువుతో పాటు వ్యక్తిత్వం ముఖ్యం

వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎజాజ్ అహ్మద్



మాట్లాడుతున్న ఎజాజ్ అహ్మద్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు వ్యక్తిత్వం కూడా ముఖ్యమని వ్యక్తిత్వ వికాస నిపుణుడు ఎజాజ్ అహ్మద్ అన్నారు. మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లిలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ క్యాంప్ సందర్భంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులే తొలి గురువులని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది వారేనన్నారు. జీవితంలో రాణించాలంటే చదువొక్కటే సరిపోదని, ఉన్నత వ్యక్తిత్వం కలిగిఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, లెఫ్టినెంట్ డాక్టర్ భవాని, సుంచు రాజు, సాయి కృష్ణ, కైలాస్, రాజశేఖర్, విష్ణుమూర్తి, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): రైతుల మనోభావాలను దెబ్బ తీసేలా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెడుతున్న మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాంపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జెల సాయిలు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొగుళ్ల ఐలయ్య, రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం మిరుదొడ్డిలో వారు వేర్వేరుగా మాట్లాడారు. ఎస్‌ఐ పర్శరాం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి మద్యం తాగుతున్నారంటూ రైతుల ఫొటోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తున్నాడని మండిపడ్డారు. పొలాలకు బైక్‌లపై వెళుతున్న రైతులను ఆపి హెల్మెట్ లేదని ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అసహనం వ్యక్తం చేశారు. రైతులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న మిరుదొడ్డి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పీఆర్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఏఈ సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొబైల్ ఫోన్ చోరీ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం కిషన్‌నగర్ వద్ద డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్న కూలీల మొబైల్ ఫోన్‌ను ఓ మహిళ మంగళవారం అపహరించింది. స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని ఆమెను పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఎండ దరువు.. నీడ కరువు

- సేద దీరేందుకు చెట్లనీడే దిక్కు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు చేపట్టాలని వినతి



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో వలసలు తగ్గించి స్థానికంగా పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి కూలీలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలో పనిచేసే కూలీలకు కాసేపు సేద తీరడానికి నీడలేని దుస్థితి నెలకొంది.

అక్కన్నపేట మండలంలోని కేశవాపూర్, మంచినీళ్లబండ, దుబ్బతండా, చాపగాని తండా, పంతుల్ తండా, ధర్మారం, నందారం, కపూర్ నాయక్ తండాలతోపాటు తదితర గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్నాయి. వేసవి కావడంతో ఎండలు దంచికొడుతున్నాయి. ఈ మేరకు ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలి. భానుడు భగభగ మండుతుండటంతో కూలీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పనులు చేస్తున్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పని ప్రదేశంలో నీడ, మంచి నీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలి. పనిచేస్తున్న సమయంలో గాయపడితే ప్రథమ చికిత్స అందించడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఉండటం లేదు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను సరఫరా చేయడంలేదు. కొన్ని గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో కూలీలు నీళ్ల బాటిళ్లు తెచ్చుకుంటున్నారు.

జిల్లా వివరాలు	
మండలాలు	23
గ్రామపంచాయతీలు	499
జాబ్‌కార్డులు	1,36,307
కూలీల సంఖ్య	2,37,958

టెంట్లు వేయాల్సి ఉన్నా..

ఎండలో గంటల తరబడి పనులు చేస్తున్న కూలీలు అలసటకు గురై కొంత సమయం సేద తీరుదామనుకున్నా పని ప్రదేశంలో నీడ ఉండటం లేదు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేయాల్సి ఉన్నా కొన్నేళ్లుగా వేయడంలేదు. జిల్లాకు కొన్నేళ్ల క్రితం టెంట్లను సరఫరా చేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు కొత్తవి అందజేయలేదు. గతంలో ఇచ్చిన టెంట్లు చిరిగిపోయాయని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం



ఉపాధి హామీ పనులకు వస్తున్న కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం నుంచి టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు రావడం లేదు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో పని ప్రదేశంలో నీడ ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. పని ప్రదేశంలో ఇతర అవసరాలకు ప్రతిపాదనలు పంపించాం. – ప్రభాకర్, ఏపీఓ, అక్కన్నపేట మండలం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి



సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రంలో రైతులను పరామర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించి ఇబ్బందులను దూరం చేయాలని రైతులు కోరారు. వారం రోజులుగా కొనుగోలు చేయకపోవడంతో మార్కెట్‌లోనే ఉంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సన్ ఫ్లవర్ కొనుగోళ్లకు చర్యలు చేపట్టారన్నారు. ప్రభుత్వం సన్ ఫ్లవర్ కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా నిచ్చారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్థానికంగా సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కొండల్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు శ్రీనాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

- ఎనిమిది వాహనాలు సీజ్
- 58 కేసులు నమోదు
- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్



వాహన పత్రాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: రవాణా శాఖ ఉత్తర్వుల మేరకు వాహనాలకు నంబర్ ప్లేట్ అమర్చుకోవాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో నంబర్ ప్లేట్‌లు లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా నంబర్ ప్లేట్ లేని వాహనాలు, త్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్‌పై 58 కేసులు నమోదు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ మాట్లాడుతూ నంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. నంబర్ ప్లేట్ లేని ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, వాహన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను వినియోగించి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనాలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్‌ఐ వినయ్‌సాగర్, ఏఎస్‌ఐ ఉమేష్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మోదీతోనే దేశ అభివృద్ధి

భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

మద్దూరు(హుస్నాబాద్): మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రదేశంగా నిలిచిందని భువనగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మద్దూరు, దూళ్మిట్ట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బైరాన్‌పల్లి అంటే పోరాటానికి పురిటిగడ్డ అన్నారు. బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఢిల్లీలో లేదు, గల్లీలో లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కరెంట్ కష్టాలతోపాటు కరువును కూడా తెచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోకగా నిధులు లేవని సాకులు చెబుతున్నారని విమర్శించారు. మోదీ అంటే దేశం, ధర్మం, అభివృద్ధి అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలిపించాలన్నారు. అంతకు ముందు బైరాన్‌పల్లి అమరుల బురుజు వద్ద అమరులకు నివాళులర్పించి, బైరాన్‌పల్లి పోరాట యోధులను సత్కరించారు. లద్నూరు మాజీ ఎంపీటీసీ రాపాక బుచ్చిరెడ్డితో పాటు ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత్‌రెడ్డి, జనగామ నియోజకవర్గ కన్వీనర్ బల్ల శ్రీను, సిద్దిపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి సురేష్‌గౌడ్, రేబర్తి ఎంపీటీసీ కూరెళ్ల రాజుగౌడ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి



కొమురవెల్లిలో పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సంఘం నాయకులు మాట్లాడారు. తెలంగాణ బహుజన ప్రజల ఆత్మగౌరవానికి సర్వాయి పాపన్న ప్రతీక అని అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తూ గౌడ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు రాజుగౌడ్, విష్ణుగౌడ్, పరశురాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు సేఫ్టీ మోకులివ్వాలి

హుస్నాబాద్: కల్లు సేకరణకు చెట్లు ఎక్కే గీత కార్మికులు ప్రమాదవశాత్తు జారిపడి మృత్యువాత పడుతున్నారని, వారికి సేఫ్టీ మోకులిచ్చి ఆదుకోవాలని హుస్నాబాద్ మండల కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన నాయకుడు సర్వాయి పాపన్న మొగల్ రాజరిక వ్యవస్థపై దాడిచేసి గోల్కొండ కోట కేంద్రంగా ఆరు నెలలు పరిపాలించాడన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పూదరి రవీందర్ గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిచెర్వు చౌరస్తాలో..

సిద్దిపేటజోన్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 314వ వర్ధంతిని అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కోమటిచెర్వు చౌరస్తాలో సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

సిద్దిపేటజోన్: ఆస్తి పన్ను, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ రుసుము, ప్రకటనల పన్నులను సకాలంలో చెల్లించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ఒకేసారి చెల్లిస్తే మొత్తంలో ఐదు శాతం రాయితీ కల్పించిందన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పన్నులను బిల్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయం, అధికారిక వెబ్‌సైట్‌లో చెల్లించాలని సూచించారు.

రాజకీయంగా రాణించాలి

ముదిరాజ్ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాస్



నియామకపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: ముదిరాజ్‌లు రాజకీయంగా రాణించాలని ముదిరాజ్ జేఏసీ జిల్లా చైర్మన్ గుంటుకు శ్రీనివాస్ అన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం ముదిరాజ్ గజ్వేల్ నియోజకవర్గ జేఏసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగిటి నివాస్ ఆధ్వర్యంలో జేఏసీ నూతన చైర్మన్ రొట్టెల శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం గుంటుకు శ్రీనివాస్ మాట్లాడుతూ హక్కుల సాధనకు ముదిరాజ్‌లు ఉద్యమించాలన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న ముదిరాజ్‌లు రాజకీయాల్లో రాణించాలన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ జేఏసీ సభ్యులు తలారి భిక్షపతి, పడిగ ప్రశాంత్, బాలేష్, రాజు, నర్సింలు, నర్సయ్య, సాయిబాబా, వెంకటేశం, నాగరాజు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి

గజ్వేల్: గజ్వేల్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, అసోయేషన్ నూతన ఉపాధ్యక్షుడు బత్తుల రాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తనను ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ లక్ష్యాలకనుగుణంగా పనిచేసి ప్రతిష్ట పెంచుతానన్నారు.

నిజాయితీ అభ్యర్థిని గెలిపించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తూ, నిజాయితీగా ఉండే భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అయినాపూర్ గ్రామంలో వుల్లంపల్లి సాయిలు అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, బీజేపీ నేతృత్వంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఎం అన్నారు. పార్లమెంటులో వామపక్షాల బలం తగ్గడంతో పదేళ్లుగా ప్రజా వ్యతిరేక బిల్లులు ఆమోదం పొందుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, అత్తిని శారద, తాడూరి రవీందర్, తేలు ఇస్తారి, వుల్లంపల్లి నర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలి

మాదిగ నియోజకవర్గ జేఏసీ నాయకులు



న్యాయవాది రవీందర్‌ను సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్: మాదిగలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని మాదిగ నియోజకవర్గ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో సంయుక్త కార్యదర్శిగా రెండోసారి ఎన్నికైన న్యాయవాది జేరిపోతుల రవీందర్‌కు మంగళవారం మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు జేఏసీ నాయకులు మాట్లాడారు. మాదిగల సేవలను విరివిగా వాడుకుంటున్న రాజకీయ పార్టీలు, సంస్థలు పదవుల పంపిణీలో ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు. మాదిగల త్యాగాలను విస్మరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

ఎంపీడీఓ రామ్మోహన్



లద్నూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ శ్రీధర్

మద్దూరు(హుస్నాబాద్): రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. మండలంలోని లద్నూరు, ధర్మారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ సీఈవో శ్రీధర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల్, కేంద్రం ఇన్‌చార్జిలు అన్నోజు భాస్కర్, సోగల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓటుహక్కును వినియోగించుకోవాలి

బెజ్జంకి(సిద్దిపేట): లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం బెజ్జంకిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటువేయాలన్నారు. ఓటు విషయంలో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.

◆ బూస్టర్ మోటర్ ఏర్పాటు



అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మైసమ్మవాగు తండా గ్రామంలో బూస్టర్ మోటర్‌ను మిషన్ భగీరథ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ మైసమ్మవాగు తండా ఎగువన ఉండటంతో భగీరథ నీరు ట్యాంక్‌లోకి ఎక్కడం లేదన్నారు. దీంతో కేశనాయక్ తండా సమీపంలోని మైసమ్మవాగుతండా గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన బూస్టర్ మోటర్‌ను రెండు రోజుల కిందట అధికారులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దుబ్బాకటౌన్: ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ అన్నారు. సోమవారం రాత్రి దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామంలో పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించింది. ప్రజలకు మూఢనమ్మకాలు, చేతబడులు, ఆత్మహత్యలు, మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు.

◆ గుడి నిర్మాణానికి విరాళాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని మర్రిచెట్టు వద్ద దుర్గమ్మ తల్లి ఆలయం నిర్మిస్తున్నారు. మంగళవారం నక్కా బాలయ్య కుటుంబం రూ.15,116, మిట్టపల్లి సాంబరాజు, బాలరాజు తమ తండ్రి రాజయ్య జ్ఞాపకార్థం రూ.10,116 మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డికి అందజేశారు. దాతలను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు సత్కరించారు.

◆ బాలవికాస కమిటీ ఎన్నిక

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల గ్రామంలో మంగళవారం బాలవికాస గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొల్లం భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా బొల్లం రవి, ఉపాధ్యక్షుడిగా చెట్టుపల్లి భానుచందర్, కోశాధికారిగా శంకర్, సహాయ కార్యదర్శిగా వెంకటేష్, కమిటీ సభ్యులుగా లక్ష్మణ్, పెంటయ్య, రాజశేఖర్, మల్లేశం, రాజు, నరేష్ ఎన్నికయ్యారు.

◆ వైభవంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని ముని కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, తొగుట ఏఎంసీ మాజీ చైర్మన్ దేవునూరి పోచయ్య, మాజీ ఉప సర్పంచ్ ఫరీద్, మాజీ డైరెక్టర్ నరేందర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం చైర్మన్ ఉత్కం సత్యనారాయణగౌడ్ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా సోకే గాలికుంటు వ్యాధిని పాడి రైతులు ముందుగా గుర్తించి సకాలంలో టీకాలు వేయిస్తే పశువులను రక్షించుకోవచ్చన్నారు.